

తిరుమలగిరి మండల కేంద్రంలో సాగు చేసిన కంది చేను

# పూత కాలం.. సస్యరక్షణే మేలు

**ప్రస్తుతం పూత దశలో కంది.. తెగుళ్లు సోకే ప్రమాదం**

రైతుల అప్రమత్తతోనే నష్ట నివారణ

వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి

తిరుమలగిరి మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

**కంది సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే సరైన దిగుబడులు వస్తాయి. పైరును ఆశించే పురుగులు, తెగుళ్లను సరైన సమయంలో గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పూత దశలో ఉన్న కంది చేలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉన్నదని, రైతులు అప్రమత్తతో నిష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. క్రిమిసంహారక మందులను మోతాదు తగ్గట్టు వాడితే అధిక దిగుబడి వచ్చి, ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు.**

– తిరుమలగిరి, డిసెంబర్ 8

కంది పంటలో పూత దశ కీలకమైనది. ఈ సమయంలో నీటి ఎద్దడి ఉన్నా, అవసరానికి మించి ఎక్కువ తడి ఇచ్చినా పూత రాలి దిగుబడి తగ్గుతుంది. ఈ క్రమంలో పూత దశలో ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తిరుమలగిరి వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు వివరించారు. పూత రాలుడు నివారణకు 8–10 లీటర్ల నీటికి ప్లానోఫిక్స్ 2మి.లీ. చొప్పున కలిపి 10రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

### పూత పెంకు పురుగు

కంది పూత దశలో ఉన్నప్పుడు ఎర్రని లేదా నారింజ రంగు మచ్చలు, నల్లని గీతలు ఉన్న పెంకు పురుగులు ఆశించి మొగ్గలను తింటాయి. దీంతో కాత తగ్గిపోతుంది. ఈ పురుగులను గమనించిన వెంటనే ఉదయం పూట వాటిని ఏరి మంటలో కాల్చివేయాలి.

### మారుకమచ్చల పురుగు

ఈ పురుగు లార్వాలు ఆకులను, పూతను, కాయలను కలిపి గూడులా చేసి తింటాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్, ఒక మి.లీ. డైక్లోరోవాస్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే 10లీటర్ల నీటికి స్పైనోసాడ్ 3 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

### ఆకుచుట్టు పురుగు

ఇది సాధారణంగా పంట పెరిగే దశలో ఆశించి నష్టపరుస్తుంది. కాని కొన్ని సమయాల్లో పూత దశలోనూ దీని ప్రభావం ఉంటుంది. లద్దెపురుగు పూత దశలో పూతను గూడులా చేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలు తయారు అయ్యేటప్పుడు మొగ్గలను దగ్గరగా చేర్చి గూడు కడుతుంది. కాయలకు రంధ్రం చేసి లోపలి గింజలు తినడం వల్ల పంటకు ఎక్కువ నష్టం జరుగుతుంది. విత్తనం మొలకెత్తే దశలో ఈ పురుగు ఆశిస్తే పంటకాలం మొత్తం దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. తద్వారా పంట తీవ్రంగా నష్టపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2.మి.లీ. చొప్పున కలిపి పూత దశలో పిచికారీ చేయాలి.



**వెంకటేశ్వర్లు, తిరుమలగిరి ఏఓ**

### పంట కోత నిల్వ

కంది కాయలు ఎండిన తరువాత మాత్రమే పంటను కోయాలి. కారణం పూత రెండు నెలల వరకు వస్తూనే ఉంటుంది. ఎండిన తరువాత కల్లెతో కొట్టి కాయల నుంచి గింజలను వేరు చేయాలి. కందులను బూడిదతో కలిపి గానీ, వేపాకు కలిపి గానీ నిల్వ చేయాలి. నిల్వ చేసేటప్పుడు పురుగులు ఆశించకుండా ఉండేందుకు బాగా ఎండబెట్టాలి. ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల కంది పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు.

# ఎంజీయూలో అదనపు హాస్టళ్లు

**మరింత మందికి వసతి కల్పించేలా నిర్మాణం**

- ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- గిరిజన శాఖ ఆధ్వర్యంలో చేపట్టేందుకు ప్రణాళిక
- యూనివర్సిటీని సందర్శించనున్న ఉన్నతాధికారులు..త్వరలో పనులు ప్రారంభం
- ప్రస్తుతం 1,050 మంది గర్ల్స్, బాయ్స్‌కు హాస్టల్ వసతి
- భవిష్యత్‌లో రెసిడెన్షియల్ వర్సిటీగా తీర్చేదిద్దేందుకు అడుగులు

నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వివిధ కోర్సులు చదివే విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించిన జీఓ 64ను గత జూలైలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఇందుకు అవసరమైన ఎంఓయూను సైతం ఆ శాఖ అధికారులతో ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి చేశారు. నూతన అదనపు హాస్టళ్ల నిర్మాణాలు చేసేందుకు అనుమతులు ఇవ్వడంతోపాటు అందుకు అవసరమైన రూ.20కోట్లను గిరిజన సంక్షేమ శాఖకు మంజూరు చేశారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి అధికారుల బృందం సభ్యులు ఎంజీయూను సందర్శించనున్నారు. హాస్టల్ భవన నిర్మాణాలు చేసే ప్రాంతాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్‌తో పనులు ప్రారంభం చేయనున్నట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

– రామగిరి, డిసెంబర్ 8



ఎంజీయూలోని లేడీస్ హాస్టల్

### అందుబాటులోకి కొత్త హాస్టల్ భవనాలు

ఎంజీయూలో ఇప్పటికే విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా సకల సౌలత్‌లతో హాస్టల్ భవనాలు ఉన్నాయి. వాటిల్లో దాదాపు 1,050 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. అయితే.. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉన్న హాస్టళ్లకు అనుసంధానం చేస్తూ నూతన హాస్టల్ భవనాలు నిర్మించాలని సంకల్పించింది. దీనికి అవసరమైన రూ.20కోట్ల నిధులు సైతం మంజూరు చేసింది. వర్సిటీలో హాస్టల్ భవనాలు ఎక్కడ నిర్మించాలనే దానిపై త్వరలోనే అధికారుల బృందం పరిశీలన చేయనున్నది. ఆ డబ్బుతో 125 మంది విద్యార్థులు, మరో 125మంది విద్యార్థినులకు ఆశ్రయం ఇచ్చేలా కొత్త భవనాలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

### రెసిడెన్షియల్ వర్సిటీగా తీర్చిదిద్దేలా..

ఎంజీయూలో వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ప్రస్తుతం హాస్టల్ వసతి కల్పించే అవకాశం లేదు. దూర ప్రాంతాల విద్యార్థులకు మాత్రమే హాస్టల్స్‌లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. కొన్ని కోర్సుల్లో ఫస్టియర్ విద్యార్థులకు హాస్టల్ అడ్మిషన్ ఉండదు. అయితే.. భవిష్యత్‌లో ఎంజీయూ క్యాంపస్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రాబోయే కాలంలో ఎంజీయూను మహాత్మాగాంధీ రెసిడెన్షియల్ వర్సిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అదనపు హాస్టల్ భవన నిర్మాణాలు చేస్తున్నారు.

### విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రణాళికలు


ఎంజీయూలో ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనాలకు అనుసంధానంగా కొత్త భవనాలు నిర్మించాలని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంకల్పించగా.. ఇప్పటికే ఆ శాఖతో ఎంఓయూ చేశాం. దానికి అవసరమైన రూ.20కోట్ల నిధులను ఆ శాఖ జీఓ నెం.64తో మంజూరు చేసింది. ఈ నిర్మాణాలు పూర్తయితే మరో 250మందికి విద్యార్థులకు హాస్టల్ వసతి అందుబాటులోకి వస్తుంది. భవిష్యత్‌లో ఎంజీయూలో చేరే ప్రతి విద్యార్థికీ హాస్టల్ వసతితో విద్యనందించాలనే సంకల్పంతో పాలకమండలి ఆమోదంతో ప్రణాళికలు చేశాం. దీంతో ఎంజీయూ భవిష్యత్‌లో రెసిడెన్షియల్ వర్సిటీగా మారుతుంది. అదేవిధంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసేలా పరిశోధనలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తూ అన్ని రంగాల్లో ఎంజీయూను ఉన్నత స్థానంలో ఉంచి విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.



– సీహెచ్ గోపాల్‌రెడ్డి, ఎంజీయూ వైస్ చాన్స్‌లర్

# కొత్తిమీర.. లాభాల పంట

**రోజూ రూ.1500 సంపాదిస్తున్న దంపతులు**



చౌటుప్పల్, డిసెంబర్ 8 : బతుకుదెరువు కోసం వలస వచ్చి కొత్తిమీర సాగులో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ దంపతులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బల్లికురువ మండలం కొణిదేన గ్రామానికి చెందిన సాన మురళి, కోటేశ్వరి భార్యాభర్తలు. ఇద్దరు పిల్లలతో కలిసి 4 సంవత్సరాల క్రితం చౌటుప్పల్‌కు వలస వచ్చారు. మొదట గానుగ నూనెల వ్యాపారం చేసిన వారు పెద్దగా లాభాలు లేకపోవడంతో వ్యవసాయంపై దృష్టి సారించారు. తెలంగాణలో 24 గంటల కరెంటు, భూగర్భ జలాలు మెండుగా ఉండటంతో కొత్తిమీర సాగు చేపట్టారు. వరి సాగు చేస్తే నెలల తరబడి పంట కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. అందుకు పెట్టుబడి కూడా ఎక్కువే. కొత్తిమీర ఖర్చు తక్కువ, నిత్యం ఆదాయం పొందవచ్చని ఆలోచించారు. ఈ క్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. తాత్కాలికంగా డ్రిప్ ఏర్పాటు చేసుకొని తక్కువ నీటితో కొత్తిమీర సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. రెండు ఎకరాల్లో ఏడాది పొడవునా పంట తీస్తున్నారు. రోజూ ఉదయం 5గంటలకు కొత్తిమీర కోసి కట్టలు కట్టి చౌటుప్పల్ మార్కెట్‌లో విక్రయిస్తారు. అవసరమైన వినియోగదారులకు పొలం వద్ద కూడా అమ్ముతారు. దాంతో నిత్యం రూ.1500కు పైగా ఆదాయం పొందుతున్నారు. మధ్యాహ్నం తర్వాత పంటకు కావాల్సిన నీటి సరఫరా, కలుపు మొక్కల తొలగింపు, ఇతర పనుల్లో నిమగ్నమవుతారు.



### వరి సాగు చేస్తే నెలలపాటు ఎదురు చూడాలి

వరి పంట సాగు చేస్తే నాలుగు నెలలు ఎదురు చూడాలి. పెట్టుబడి కూడా ఎక్కువ. కొత్తిమీర సాగు చేస్తే 45 రోజుల్లోనే చేతికొస్తుంది. ఇప్పుడు రోజూ రూ.1500 వరకు ఆదాయం వస్తున్నది. ఖర్చులు తక్కువే. అందుకనే కొత్తిమీర సాగు చేస్తున్నాం. రెండు ఎకరాల్లో నాలుగు లేయర్లు ఏర్పాటు చేశాం. ప్రతి ఏడాది 4–5పంటలు తీస్తున్నాం.

– సాన కోటేశ్వరి

### కొత్తిమీరతో మంచి ఆదాయం వస్తున్నది

నాలుగేండ్ల కింద చెక్క గానుగ నూనెల వ్యాపారం కోసం ఇక్కడకు వచ్చాం. అందులో అనుకున్న స్థాయిలో లాభాలు రాలేదు. మూడేండ్లు అదే కొనసాగించాం. లాభాలు అంతంతమాత్రమే ఉండడంతో కొత్తిమీర సాగుపై దృష్టి సారించాం. రెండెకరాలు లీజుకు తీసుకొని కొత్తిమీర సాగు చేశాం. ప్రతిసారీ దున్నకానికి, విత్తనాలకు, ఎరువులు, కొన్ని డ్రిప్ పైపులు మార్చడంతోపాటు ఇతర ఖర్చులకు రూ.15వేల వరకు అవుతుంది. కొత్తిమీర పంట చేతికొచ్చాక రోజూ రూ.1500 వరకు వస్తుంది. ఖర్చులు పోను నెలకు రూ.30వేలు మిగులుతుంది. మార్కెట్‌కు, కరెంట్‌కు ఏ ఇబ్బందీ లేదు. కూరగాయల వ్యాపారులు పొలం దగ్గరికి కూడా వచ్చి కొనుగోలు చేస్తారు. పండుగలు, పెండ్లిళ్ల సమయంలో హైదరాబాద్ నుంచి వస్తారు. రోజూ చేతినిండా పని దొరుకుతుంది. మా ఇద్దరికీ కూలి పడుతుంది.



– సాన మురళి



కుర్రారంలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతు

# 2,61,105 ఎకరాల్లో పంటల సాగు

**యాదాద్రి జిల్లాలో యాసంగి సాగుకు ప్రణాళిక ఖరారు**

- గతేడాదితో పోలిస్తే ఈ సారి 50 వేల ఎకరాల్లో తగ్గిన పంటల అంచనా
- నీటి కొరత, వర్షపాత లోటుతోనే తగ్గుదల
- అత్యధికంగా 2,40,500 ఎకరాల్లో వరి
- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసేందుకు ప్లాన్
- నకిలీ విత్తనాలపై అధికారుల ఫోకస్




యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయిలో సేకరించిన సమాచారంతో వ్యవసాయ శాఖ అధికారులు సాగు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే వరి కోతలు తుది దశకు రాగా.. యాసంగి సీజన్ కోసం రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో అన్ని పంటలు కలిపి 2,61,150 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందులో అత్యధికంగా 2,40,500 ఎకరాల్లో వరి వేయనున్నారు. 150 ఎకరాల్లో సిరిధాన్యాలు, 150 ఎకరాల్లో పప్పు దినుసులు, 250 ఎకరాల్లో ఆయిల్ సీడ్, 20,100 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు.

### అందుబాటులో ఎరువులు, విత్తనాలు

యాసంగి సీజన్ ప్రారంభం నేపథ్యంలో విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎంత మేర ఎరువులు, విత్తనాలు అవసరమో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏ పంటలకు ఎన్ని క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయో జిల్లా వ్యాప్తంగా డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. దీంతోపాటు ఎరువులు ఎంత మొత్తంలో అవసరమో ఆయా నెలల వారీగా మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చూడనున్నారు. ఎరువుల కొరత రాకుండా అవకాశం ఉన్నచోట బఫర్ స్టాక్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

### నకిలీ విత్తనాలపై ఫోకస్

యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు పటిష్ట నిఘా పెట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారుల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో వ్యవసాయ శాఖ నుంచి ఏడీఏ, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ శాఖ నుంచి సీఐ, ఎస్ఐతోపాటు కానిస్టేబుల్ ఉంటారు. యాదాద్రి జిల్లాలోని 17మండలాల్లో ప్రభుత్వ అనుమతితో విత్తనాలను విక్రయించేందుకు 195 విత్తన దుకాణాలు ఉన్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాల కొరత లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



### నీటి కొరతతో తగ్గనున్న సాగు

బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు. 24గంటల నాణ్యమైన ఉచిత కరెంట్, పుష్కలంగా విత్తనాలు, ఎరువులు, రసాయనాలు అందుబాటులో ఉండేవి. దీంతో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందుకొచ్చారు. కానీ.. ఈ సారి సాగు తగ్గుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. గతేడాది కంటే 49వేల ఎకరాల్లో పంటల సాగు తగ్గే అవకాశం ఉన్నదని ప్రణాళికలో పేర్కొన్నది. గతేడాది 3,10,165 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని భావించారు. ఈ సారి పంటల సాగు తగ్గడానికి నీటి కొరత, వర్షాలు సరిగా రాకపోవడం కారణమని తెలుస్తున్నది.